క్లుప్తంగా

ఉత్సవమూర్తుల గ్రామోత్సవం



ముసునూరు: మండలంలోని చెక్కపల్లిలో నిర్మితమైన శ్రీకృష్ణ పరమాత్మ ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు బుధవారం గ్రామోత్సవం జరిగింది. తమిళనాడులోని మహాబలిపురం నుంచి తీసుకువచ్చిన ఈ విగ్రహాలకు ముసునూరు, చింతలవల్లి, గోగులంపాడు, అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి, బాసవరప్పాడు, లోపూడి గ్రామాల మీదుగా ఊరేగింపు నిర్వహించి అనంతరం ఆలయానికి తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని జూన్ 5న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

డీఎస్సీ అభ్యర్థికి సాయం



తిరువూరు: ఆర్థిక ఇబ్బందులతో డీఎస్సీ పరీక్షలకు సిద్ధం కావడంలో ఇబ్బందులు పడుతున్న గుడివాడకు చెందిన కావూరి వెంకట నాగకుమార్‌కు ప్రైవేటు అర్చక పురోహిత సంక్షేమ సంఘం చేయూత నందించింది. టీచర్ ఉద్యోగం సాధించడానికి, ఆన్‌లైన్ మాక్ టెస్టులకు సిద్ధమవడానికి అవసరమైన స్మార్ట్ ఫోన్‌తో పాటు కొంత నగదును దాతల సహకారంతో సేకరించి బుధవారం నాగకుమార్‌కు అర్చక పురోహిత సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరప్రగడ విజయకుమార్ అందజేశారు.

రోడ్డుపైనే వర్షం నీటి నిల్వ



చాట్రాయి: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు సీసీ రోడ్డుపై వర్షం నీరు నిలిచి చిన్నపాటి చెరువుని తలపిస్తుండటంతో దళిత కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చనుబండ పాత దళితవాడ సీఎస్ఐ చర్చి వద్ద సుమారు 30 మీటర్ల దూరం ఉన్న సీసీ రోడ్డు పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు వెళ్లే మార్గం లేక రోడ్డుపై రోజుల తరబడి నిలిచిపోతోంది. దీంతో దోమలు విజృంభించి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

మైలవరం: పుస్తకాలు చదివి విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వెల్వడం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు వాడపల్లి వసంతరావు అన్నారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పుస్తకాలు చదవడం వలన కలిగే ఉపయోగాలు, సెల్‌ఫోన్లు అధికంగా ఉపయోగించడం వలన కలిగే నష్టాలను వివరించారు. పుస్తకాలు మనకు ఆనందాన్ని, అవగాహనను, మానసిక పరిపక్వతను, ఏకాగ్రతను, సృజనాత్మకతను అందిస్తాయన్నారు. పుస్తకం చదవడం అనేది మంచి అలవాటు అని, పుస్తకాన్ని మించిన మిత్రుడు లేడని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో దివంగత ఎన్టీఆర్ జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సంస్థ చీఫ్ ఇంజినీర్ శివ రామాంజనేయులు ఉద్యోగులతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. పలువురు సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముసునూరు: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో బుధవారం ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కేవీ రమణ, ఎంపీడీఓ బీపీ సత్యనారాయణ, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): మండలంలోని అనుమంచిపల్లిలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు ఆలయాన్ని పునర్నిర్మించారు. స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువు మట్టినీ బొక్కేస్తున్నారు!

- రైతుల పేరుతో అనుమతులు
- చెరువు మట్టి తవ్వి ఇటుక బట్టీలకు తరలింపు
- నాగులూరు జువ్వి చెరువును గుల్ల చేస్తున్న టీడీపీ నాయకులు
- 3 వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి పొంది 8 వేల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టి తరలింపు



నాగులూరు జువ్వి చెరువులో మట్టి తవ్వి ట్రాక్టర్లకు లోడు చేస్తున్న పొక్లెయిన్



నాగులూరు ఇటుక బట్టీ వద్ద డంపు చేసిన జువ్వి చెరువు మట్టి

జి.కొండూరు: రైతుల పొలాలకు మెరక పేరుతో రెడ్డిగూడెం మండల పరిధి నాగులూరు జువ్వి చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతి పొందారు. వందల ట్రాక్టర్లతో వేల ట్రక్కుల మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తూ టీడీపీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. తూముల కన్నా లోతుగా ఉన్న చెరువును ఇంకా తవ్వి గుల్ల చేస్తున్నారు. రోజుకి వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించి రూ.లక్షలు పోగేసుకుంటున్నారు. గత నాలుగు రోజుల నుంచి తవ్వకాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి.

మట్టి దోపిడీ ఇలా..

రెడ్డిగూడెం మండల పరిధి నాగులూరు జువ్వి చెరువులోని మట్టిని రైతుల పొలాలకు మెరక చేసేందుకు అంటూ గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల పేరుతో టీడీపీ నాయకులు అనుమతులు పొందారు. నాగులూరు గ్రామానికి చెందిన రైతు దిమ్మేటి శ్రీనివాసరావుకు చెందిన ఆర్ఎస్ నంబరు 49–2ఏ లో గల 2.18 ఎకరాలకు 1200 క్యూబిక్ మీటర్ల మట్టి, కొలుసు నాగరాజుకు చెందిన ఆర్ఎస్ నంబరు 55/1లో గల 0.60 ఎకరాలకు 900 క్యూబిక్ మీటర్ల మట్టి, దుట్టా సత్యనారాయణకు చెందిన ఆర్ఎస్ నంబరు 14–2బిలో గల 1.75 ఎకరాలకు వేయి క్యూబిక్ మీటర్ల మట్టి, మొత్తంగా 3,100 క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతి పొందారు. ఈ అనుమతి పొందడంలో కూడా టీడీపీ నాయకులు తమ తెలివిని ప్రదర్శించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా మట్టిని తరలించేందుకు ఎంచుకున్న ఇటుక బట్టీలకు పక్కనే ఉన్న రైతుల పొలాలను ఎంచుకొని ఆ సర్వే నంబర్ల పేరుతో అనుమతులు పొందారు. ఈ అనుమతులను అడ్డు పెట్టుకొని గత నాలుగురోజులు నుంచి వందల ట్రాక్టర్లతో మట్టిని యథేచ్ఛగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు.

ట్రక్కుకు రూ.200 ఎల్లో ట్యాక్స్ వసూలు

ఇటుక బట్టీలకు మట్టిని తరలించేందుకు బట్టీల నిర్వాహకులతో టీడీపీ నాయకులు ముందుగానే ఒప్పందం కుదుర్చుకున్నారు. చెరువులో మట్టిని తవ్వేందుకు వాడే జేసీబీల ఖర్చు, మట్టి రవాణా చేసే ట్రాక్టర్ల ఖర్చుతో కలిపి ఒక్కొక్క ట్రక్కుకు రూ.600 బట్టీల యజమానులే భరిస్తూ టీడీపీ నాయకులకు ట్రక్కు మట్టికి రూ.200 చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. దీనితో పాటు అధికారులకు అందించే ముడుపులు కూడా బట్టీల నిర్వాహకుల నుంచే వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా అనుమతి పొందిన 3,100 క్యూబిక్ మీటర్ల మట్టిని మొదటి రోజునే తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. అనుమతి మీరి గత నాలుగు రోజుల్లో 8 వేల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టిని బట్టీలకు తరలించినట్లు చెరువులో తవ్వకాలను బట్టి అర్థమవుతోంది.

రైతుల ఆందోళన

నాగులూరు జువ్వి చెరువు ఇప్పటికే తూముల కన్నా లోతుగా ఉండడం వల్ల చెరువులో నీరు పూర్తిగా బయటకు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు ఐదు జేసీబీలు, వందల ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న నేపథ్యంలో చెరువు భౌతిక స్వరూపమే మారిపోయి చెరువు నుంచి నీరు బయటకు వచ్చే అవకాశం ఉండదని ఆందోళన చెందుతున్నారు. చెరువు కట్టకు ఆనుకొని తవ్వకాలు జరుపుతున్న క్రమంలో భారీ వర్షాలు పడినప్పుడు చెరువు నిండితే కట్ట తెగి నీరంతా గ్రామం మీద పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

తవ్వకాలకు అధికారుల మద్దతు..

నాగులూరు జువ్వి చెరువులో టీడీపీ నాయకులు చేస్తున్న అక్రమ మట్టి దోపిడీకి అధికారులు సైతం మద్దతు పలుకుతున్నారు. ఈ మట్టి దోపిడీపై పాత నాగులూరుకి చెందిన ఒక రైతు ఫిర్యాదు చేయగా పరిశీలనకు వచ్చిన ఇరిగేషన్ ఏఈని 'సాక్షి' వివరణ కోరింది. ఇరిగేషన్ ఏఈ ఎం. విజయ్‌కుమార్ వివరణ ఇస్తూ నిబంధనల ప్రకారమే తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఈరోజు వరకు సక్రమంగానే జరుగుతుంది కానీ గత రెండు రోజుల్లో మట్టి రవాణా ఎలా జరిగిందో, మట్టిని ఎక్కడికి తరలించారో తనకు తెలియదని తప్పించుకున్నారు. ఈ నెల 30 వరకు అనుమతి గడువు ఉందని, అప్పటి వరకు మట్టిని తరలించుకోవచ్చంటూ టీడీపీ నాయకులకు భరోసా ఇచ్చినట్లు మాట్లాడారు.

వైభవంగా అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



ముసునూరు: చింతలవల్లి శివారు గోగులంపాడులో కంచర్ల వంశీకుల ఇలవేల్పు అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆ వంశ ఆడపడుచులు, గ్రామ ఆడపడుచులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దర్శించి పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు అత్యంత వైభవంగా జరుగనున్న ఉత్సవాల్లో శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తొర్లపాటి శ్రీనివాస్, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సుధాకర్, మాజీ సర్పంచ్ పల్లెపాము కుటుంబరావు, వ్యవసాయ సొసైటీ మాజీ అధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావు, సుగసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

పెనుగంచిప్రోలు: మండలంలో విత్తనాల దుకాణాలను ఏఓ రామసుబ్బారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. విత్తన దుకాణాల్లో స్టాక్, రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. పత్తి, మిరప విత్తనాల స్టాక్ లభ్యతపై ఆరా తీశారు. విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలని డీలర్లకు సూచించారు. లేకుంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు.

మినీ లెదర్‌పార్క్ నిర్మాణం చేపట్టాలని వినతి

వెల్లటూరు(జి.కొండూరు): వెల్లటూరు గ్రామంలో ప్రభుత్వం గుర్తించిన మినీ లెదర్ పార్క్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజయవాడ కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహకు బుధవారం వినతిపత్రం అందజేశారు. రాజారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం అజయ్ పథకం కింద మినీ లెదర్ పార్క్‌కు రూ.5.30 కోట్లు మంజూరు చేసి బ్యాంక్‌లో జమ చేసిందని చెప్పారు. లెదర్ పార్క్ నిర్మాణం జరిగితే ఎంతో మందికి జీవనోపాధి లభిస్తుందన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామం పర్యటనలో సీఎం చంద్రబాబు ఏప్రిల్ 5న వెల్లటూరు లెదర్ పార్క్ నిర్మాణానికి అక్కడే శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బట్టపర్తి రాజు, మహిళా అధ్యక్షురాలు సదిపాము లిల్లిమ్మ, సాలేమురాజు, ఖాశీం, అభి, వర్షిణి పాల్గొన్నారు.



డీఆర్వో లక్ష్మీనరసింహకు వినతిపత్రం అందజేస్తున్న చర్మకార సేవా సంఘం సభ్యులు

యాసిడ్ దాడి నిందితురాలికి రిమాండ్

ఇబ్రహీంపట్నం: గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ ప్రకాష్‌పై యాసిడ్ దాడి చేసిన నిందితురాలు ఇందిరా ప్రియదర్శికి కోర్టు రిమాండ్ విధించింది. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ప్రియదర్శిని ప్రిన్సిపాల్ వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించారు. ఈనెల 19న ప్రిన్సిపాల్ చాంబర్‌కు వచ్చిన ఆమె ఆయనపై యాసిడ్ దాడికి పాల్పడింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అనంతరం నిందితురాలిని కోర్టులో హాజరుపర్చగా ఆమెకు రిమాండ్ విధించి విజయవాడ సబ్ జైలుకు తరలించారు.

సినిమా థియేటర్ల తనిఖీ

ఇబ్రహీంపట్నం: డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు కొండపల్లి, ఇబ్రహీంపట్నంలోని సినిమా థియేటర్లను తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. పవన్ కల్యాణ్ నటించిన వీరమల్లు సినిమా జూన్‌లో విడుదల కానున్న నేపథ్యంలో సినిమాహాల్స్ యజమానులు బంద్‌కు పిలుపునివ్వడంతో ఆగ్రహానికి గురైన పవన్ కల్యాణ్ సినిమా థియేటర్లు తనిఖీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో కొండపల్లి శివకృష్ణ, ఇబ్రహీంపట్నం బాలాజీ థియేటర్, స్వర్ణ సినిమా కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. థియేటర్‌లో సేఫ్టీ పరికరాలు, టిక్కెట్ల ధరలు, టాయిలెట్లు, క్యాంటీన్‌లో తినుబండారాల ధరల పట్టిక, అమ్మకం ధరపై ఆరా తీశారు. ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే అందించాల్సిన సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. థియేటర్ల నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ వరప్రసాద్, వీఆర్వో అంజయ్య పాల్గొన్నారు.

- **విస్సన్నపేట:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక రెండు సినిమా థియేటర్లను బుధవారం తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి తనిఖీ చేశారు. థియేటర్లలో సౌకర్యాలు, సీట్లు తదితర అంశాలను పరిశీలించారు. ఆర్ఐ సుజాత పాల్గొన్నారు.
- **మైలవరం:** మైలవరంలోని సినిమా థియేటర్లలో అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. థియేటర్లలో టికెట్ రేట్లు, వసతులు ఏ విధంగా ఉన్నదీ, థియేటర్లలో యాజమాన్యం కల్పిస్తున్న వసతులను ప్రేక్షకులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ అబ్దుల్ దరియా, సిబ్బంది పాల్గొన్నారు.



కొండపల్లి శివకృష్ణ థియేటర్‌లో సదుపాయాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

యోగాతో మెరుగైన జీవన విధానం



విస్సన్నపేటలో యోగా సాధన చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ఇబ్రహీంపట్నంలో సూక్ష్మ వ్యాయామాలు చేయిస్తున్న ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మెరుగైన జీవన విధానం అలవడుతుందని యోగా గురువు లంకే జనార్దన్ అన్నారు. కొండపల్లి మున్సిపాల్టీ ఆధ్వర్యంలో యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పవిత్ర సంగమం వద్ద యోగాపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. యోగా గురువు జనార్దన్ మాట్లాడుతూ యోగాతో దీర్ఘకాలికంగా వేధిస్తున్న మధుమేహం, బీపీ, థైరాయిడ్, వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు వంటి వాటికి ఉపశమనం లభిస్తుందన్నారు. నెల రోజుల పాటు తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సూక్ష్మ వ్యాయామాలు, యోగాసనాలు, ధ్యానంపై అవగాహన కల్పించి సాధన చేయించారు. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, ఉద్యోగులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది యోగా సాధన

విస్సన్నపేట: డీఎఫ్ఓ వి. శంకరరావు, ఎస్ఎఫ్ఓ షేక్ జాన్ అహ్మద్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక సిబ్బంది యోగా సాధన చేశారు. ప్రతి రోజూ యోగా, సూర్య నమస్కారాలు చేస్తామని అగ్నిమాపక సిబ్బంది చెప్పారు.

ధర్నా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



తిరువూరులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

తిరువూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ జూన్ 2న మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ నియోజకవర్గ సమితి కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా తెలిపారు. ఈ కార్యక్రమ వాల్ పోస్టర్లను బుధవారం గంపలగూడెంలో ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున నివేశన స్థలాలివ్వాలని, పక్కాగృహాల నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆందోళనలు నిర్వహించనున్నామని చెప్పారు. సీపీఐ గంపలగూడెం మండల కార్యదర్శి గొట్రాజు రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

- సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 2న జరిగే ధర్నా కార్యక్రమ వాల్‌పోస్టర్లను స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో బుధవారం నాయకులు ఆవిష్కరించారు. సీపీఐ తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ మాట్లాడుతూ పేదలకిచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనుబంధ సంఘాల నాయకులు సుబానీ, సునీల్, మురళి, హసన్, నాగూర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం కోసం ఎదురుచూపు

ఏడాదిగా ప్రజాప్రతినిధులకు అందని వైనం

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు చెల్లించలేదు. ప్రతి ఎంపీటీసీ సభ్యుడికి నెలకు రూ.3 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మూడు విడతల్లో గౌరవ వేతనాలు చెల్లించారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల కారణంగా గత ప్రభుత్వం చెల్లించలేకపోయింది. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదిరింది. అంతకుముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి గౌరవ వేతనాలు రావాల్సి ఉందని ఎంపీటీసీ సభ్యులు వాపోతున్నారు. మండలంలో మొత్తం 18 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ సీపీకి సంబంధించి 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వారిలో ఒక ఎంపీటీసీ సభ్యురాలు రావి విజయలక్ష్మి మృతిచెందారు. టీడీపీకి ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరిలో ఒక్కో ఎంపీటీసీ సభ్యుడికి సుమారు రూ.54 వేలు బకాయిలు పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మండల సర్వసభ్య సమావేశలకు తప్ప అధికారులు తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ ఆనందబాబును వివరణ కోరగా బడ్జెట్ ఆలస్యం కావడం వల్ల గౌరవ వేతనాలు జమ కాలేదన్నారు. ప్రస్తుతం బడ్జెట్ వచ్చిందని, బిల్లు కూడా పెట్టామని, త్వరలోనే ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు జమ చేస్తామని చెప్పారు.

నూజివీడు–ఏలూరు రహదారి పరిశీలన

నూజివీడు: నూజివీడు–ఏలూరు ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా నూజివీడు ఊటవాగు వద్ద 9 సెంట్లు, ముసునూరు మండలం సింహాద్రిపురం వద్ద 5 సెంట్లు స్థల సేకరణ చేయాల్సి ఉందని, అది పూర్తయిన వెంటనే రోడ్డు అభివృద్ధి పనులు చేపడతామని ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. ఈ రహదారిని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు.

గత ప్రభుత్వంలో నిధులు మంజూరు

ఈ రహదారి 3.75 మీటర్ల వెడల్పు ఉండగా దానిని 7 మీటర్లకు పెంచి అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతంలో రూ.42.70 కోట్లను మంజూరు చేసి టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌ను సైతం ఎంపిక చేసింది. పనులు చేయడంలో జాప్యం జరగడంతో ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కార్యక్రమంలో ఈఈ ఏడుకొండలు, డీఈ బాబూరావు, ఏఈ అశోక్ పాల్గొన్నారు.



రహదారి మలుపును పరిశీలించి సూచనలిస్తున్న ఎస్ఈ సత్యనారాయణ

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు నూజివీడు పట్టణం, మెయిన్ రోడ్డు సమీప కాపురస్తులు వైదాటి జ్యోతిశ్రీ, D/o. వైదాటి ప్రభాకరరావు యొక్క సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు భర్త మల్లాడ కోమల శ్రీరామ్ గత సంవత్సర కాలంగా నా క్లయింటు నుండి వేరుగా ఉంటూ వస్తున్నారు. నా క్లయింటు తన ఇద్దరు పిల్లలతో వేరుగా ఉంటూ వస్తున్నారు. నా క్లయింటు భర్త అయిన మల్లాడ కోమల శ్రీరామ్ హైదరాబాద్, రామ్‌నగర్ C.C.S. పోలీస్ స్టేషన్‌లో వేరు వేరు కేసులలో నిందితునిగా ఉన్నట్లుగా పోలీసు వారు నా క్లయింటుకు సదరు కోమల శ్రీరామ్ ఆచూకీ గురించి విచారిస్తున్నట్లుగా సదరు కోమల శ్రీరామ్ చేసే ఎటువంటి ఆర్థిక లావాదేవీలకు గానీ, ఆర్థిక నేరాలకు గానీ, ఇతరత్రా కార్యకలాపాలకు, నా క్లయింటుకు గానీ, ఆమె పిల్లలకు గానీ ఎటువంటి బాధ్యత లేదు. సదరు వ్యక్తితో నా క్లయింటు వేరుగా ఉంటూ, నా క్లయింటు బ్రతుకు తను బ్రతుకుచున్నారు.

కావున యావన్మందికి తెలియజేయునది సదరు మల్లాడ కోమల శ్రీరామ్‌తో నా క్లయింటుకు ఎటువంటి రిలేషన్ లేదు. గత సంవత్సర కాలంగా తను ఎక్కడ ఉన్నారు, ఏమి చేస్తున్నారు, ఎందుకు చేస్తున్నారో, ఎవరెవరితో ఏఏ లావాదేవీలలో ఉన్నారో తెలియదు కావున యావన్మందికి నా క్లయింటు తెలియజేయునది సదరు మల్లాడ కోమల శ్రీరామ్ S/o. సత్యం, భద్రాచలం కాపురస్తునికి, నా క్లయింటుకు ఎట్టి సంబంధం, బాంధవ్యాలు లేవని ఈ ప్రకటన ద్వారా తెలియజేసుకొనుచున్నారు.

నూజివీడు / తే. 28-5-2025 — గోళ్ళ ప్రసాదరావు, న్యాయవాది, మీర్జాపురం, నూజివీడు. సెల్.9247310036

● అటుగా వెళితే అంతే!





మునగపాడు ఎస్టీ కాలనీ వద్ద రహదారిని ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న పాడుబడిన బావి; మునగపాడు గ్రామ శివారులో రహదారిని ఆనుకొని ఉన్న బావి

కందులపాడు నుంచి గంగినేని వరకు ఉన్న 242వ నంబర్ స్టేట్ హైవేకి ఆనుకొని మునగపాడు గ్రామంలో ఎస్టీ కాలనీ వద్ద ఉన్న పాడుబడిన బావి, ఇదే గ్రామ శివారులో ఉన్న మరొక పాడుబడిన బావి ప్రమాదకరంగా మారాయి. ఈ రెండు బావులు కూడా రహదారిని ఆనుకొని ఉండడం వల్ల రాత్రి సమయాల్లో వాహనాలు అదుపుతప్పి బావులలో పడితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ బావులు గత కొన్నేళ్లుగా వాడుకలో లేనప్పటికీ పూడ్చకుండా వదిలివేశారు. అధికారులు వెంటనే స్పందించి ఈ రెండు బావులను పూడ్చడం కానీ, రెండు బావులకు రక్షణగా ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేయాలని, ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. –జి.కొండూరు

కిశోర బాలికలకు అవగాహన

నందిగామరూరల్: రుతుక్రమ సమయంలో కిశోర బాలికలు, మహిళలు విధిగా పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారులు కామేశ్వరి, గౌతమి సూచించారు. లింగాలపాడు పీహెచ్‌సీలో రుతుక్రమం–ఆరోగ్యం–పరిశుభ్రతపై కిశోర బాలికలు, మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పౌష్టిక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి పాల్గొన్నారు.